# 5
# వర్గమూలాలు

గంగకు ఆగమాగముంది. మనసు తొక్కులాడుతుంది. ఈ బతుకమ్మను ఎందుకు పెట్టుకుంటి అనుకుంటుంది. ఊరంతా తనవాళ్లుగానే అనిపిస్తున్నరు. ఆపదకు సంపదకు తనవెంట ఉండేవాళ్లుగానే అనిపిస్తున్నరు. మాటల్లో చేతల్లో, నవ్వుల్లో, ఎక్కడా దొరకడంలేదు. కలుపుగోలుగానే ఉంటున్నరు. ఆత్మీయతగానే మాట్లాడుతున్నరు. అయినా ఎక్కడనో అడ్డుగోడ. ఎప్పుడో పెదవి విరుపు. ఏదో సామాజికపు అసమానత.

వాళ్లు తనని దూరంగా ఉంచుతున్నరా...? తనే దూరంగా ఉండాలనుకుంటుందా! ఈ ఆలోచనలు తనలో పుట్టినయా లేక వాళ్లు ఆ భావనతో ఉన్నరా? అంటరానితనానికి మూలాలు ఎక్కడున్నయి. ఇన్నేండ్లపోరాటం, ఆరాటం, స్వేచ్ఛ... సమానత్వం, హక్కులు... అన్ని ఉట్టిమాటలేనా...?

" గంగమ్మా..... ఓ గంగమ్మా..... ఉన్నవా లేదా! " బయటనుండి పిలుపు.

గంగ ఉలికిపడి తేరుకుంది. తను ఆలోచనల్లో ఉన్నా సద్ది పులుసు మాత్రం తయారయింది. వేయాల్సినవి గిన్నెలో వేస్తనే ఉంది. చివరగా కల్యామాకు దూసిపోస్తూ "ఆ...ఎవలూ..." అంటూ కిటికీలనుంచి వాకిట్లకు తొంగిచూసింది.

వాకిట్ల రెడ్డీలమ్మ నిలబడి ఉంది. పేరు వెంకటనర్సవ్వ. ఆపేరుతో ఎవలూ పిలువరు. అందరూ రెడ్డీలమ్మనే అంటరు. వయసు అరువైపైననే ఉంటుంది. ఒకప్పుడైతే ఎస్సీల నీడ పారనిచ్చేదికాదట.

కొడుకులు ఎక్కడోళ్లక్కడ వెళ్లిపోయి ఒంటిది కావడంతో ఊరంత తన వాళ్లే అంటుంది.

"అయ్యో...లోపలికిరా! వాకిట్లనే నిలవడితివమ్మా! " స్టౌమంటను తగ్గిస్తూ అన్నది గంగ. సద్దిపులుసు మరుగుతుంది. అది తన మనసులాగే అనిపించింది. మూతపెట్టి బయటకు వచ్చింది.

రెడ్డీలమ్మ సోఫాలో కూసుంది. జరంతో మూల్గుతుంది. కాళ్లకు వాపులచ్చినయి. గంగను చూడంగనే " జరమచ్చింది గంగమ్మా... బతుకు పాడుగాను దేవునికి గూడా కక్కత్తన్న. ఎన్నడు కొంటవోతడో...మొన్న నెత్తినొప్పి లేత్తే ఒక్కగోళి ఇచ్చినవు. పెట్ల గుంజింది. ఇప్పుడుగూడా ఒక గోళీ ఉంటె ఇయ్యి. డాక్టర్ బాలయకు సూయించుకుందామంటే నిన్నటినుంచి ఇటాంకల వత్తలేడు." గొనుక్కుంటూ చెప్పింది.

మందుగోళీల దబ్బా వెదికి రెండు గోళీలు తీసిచ్చింది గంగ.

నాలుగైదు రకాల గోళీలను ఎప్పుడూ ఇంట్లో ఉంచుతుంది. నర్సింగ్ కోర్సు చదివింది. మందుల గురించి తెలుసు. తను ఊర్లె అంగన్‌వాడి టీచర్ గూడా. పిల్లల తల్లులతో అటాచ్ ఉంటుంది. ఆరోగ్యం గురించి వాళ్లతో చర్చిస్తుంది. సలహాలను,దగ్గు జరం, సర్దిలాంటి మామూలు రోగాలకు మందులను ఇస్తుంది. పైసలిస్తనంటే నా దగ్గరికే రావద్దంటుంది.

" నీ కడుపు సల్లగుండ.... ఎప్పుడచ్చినా లేదనవు. ఒక గోళిమింగి మలుసుకపంట." అంటూ లేచింది రెడ్డీలమ్మ. రెండడుగులు ముందుకేసి " సద్దిపులుసు పెడుతున్నట్టున్నవు..." అన్నది. గంగ చిన్నగా నవ్వి ఊకుంది.

రెడ్డీలమ్మ కడుపదాటబోతూ ఒకసారి మల్లెసల్లకుతొంగిచూసి... " అగో...గదేంది గంగమ్మా..." అని అడిగింది. అక్కడ కాగితం పూలు అతికించిన ఎలిత బతుకమ్మ ఉంది.

"పువ్వు బాగా దొరుకుతలేదని ఎలితె బతుకమ్మ కొన్న. రేపే సద్దుల బతుకమ్మగదా! సద్ది పులుసు గూడా అందుకే పెడుతున్న. రేపు సద్దిల కొండవోవాలెగదా!" అన్నది గంగ.

రెడ్డీలమ్మ పెదవి విప్పలేదు. మారుపలుకలేదు. కొన్ని క్షణాలు మాత్రం విచిత్రంగా చూసింది. గంగకు దొరుకకుండా తనలోని భావాలను దాచుకుని మూలుగుతూ వెళ్లిపోయింది.

రెడ్డీలమ్మ మొఖంలో మారిన భావాలను గంగ పసిగట్టింది. ఏ అసమానతలను చెరిపేసి ఆమె తన ఇంట్లోకి అడుగుపెట్టిందో ఆ అసమానతలే తను చెరిపేస్తుంటే ప్రశ్నిస్తున్నట్టుగా అనిపించింది.

పొద్దటినుంచి తనలో మసులుతున్న ప్రశ్నలు మళ్ళీ బయటకచ్చినయి. అట్లనే సోఫాలో నీరసంగా కూలబడిపోయింది గంగ. రెండు రోజుల కింద పిల్లలకు పాటను నేర్పుతుంటే జరిగింది గుర్తుకచ్చింది.

ఊరు చిన్నదే కాబట్టి ఒక్కటే అంగన్‌వాడి సెంటర్ ఉంది. ఆయమ్మ ఉన్నా తనే ఇంటింటికి వెళ్లి పిల్లల్ని తీసుకొస్తుంది. ఏ ఇంటికి వెళ్లినా బాగానే పిలుస్తరు. ఆపద సంపదలుంటే చెప్పుకుంటరు.

ఆ రోజు పిల్లలకు బంతి పాటను నేర్పుతుంది గంగ. పూజారి పంతులు బిడ్డ శ్రీజ అల్లరి చేస్తుంది. దగ్గరికి తీసుకుని ముద్దాడి ముచ్చట్లోకి దింపింది గంగ.

శ్రీజ తల్లిది గంగ ఈడే. కలుపుగోలు మనిషి. చీరెలమీద ఎంబ్రాయిడరీ, అద్దాల పోత గంగకు ఆమెనే నేర్పింది. గంగ ఓర్‌లాక్ మిషిన్‌ను మండల స్కీంలో ఇప్పించింది ఆమెకు.

" మీ తమ్మునితో ఆడుకుంటున్నవా శ్రీజా..." గంగ అడిగింది.

"మేడమ్! తమ్ముడు మీ టీకప్పు పలుగ్గొట్టిండు." శ్రీజ చెప్పింది. వయసు మూడేండ్లే అయినా పుట్టెడు మాటలు. పాప ఏం చెబుతుందో ముందుగా అర్థంకాలేదు గంగకు. వివరాలన్నీ అడిగి ఒకదానికొకటి అతుక్కుంటే తనువాళ్ల ఇంటికి వెళ్లినప్పుడల్లా టీ ఇచ్చే కప్పు వేరుగా పెడుతారని బయటివాళ్లు ఎవరచ్చినా అదే కప్పుల పోస్తారని కూర్చున్న కుర్చీపై పసుపు నీళ్లు చల్లుతారని అర్థమైంది. గంగ గుండెలో కలుక్కుమంది.

కనిపించే మనిషిని కాదని కనిపించని కులాన్ని గుర్తుకు తెచ్చే బలమైన అంశం ఏంటిది? తనను కులంతో వేరుచేసే ఆలోచన వీళ్లకు ఎక్కడ మొదలయితుంది..?

మూలాలను వెదుకుతుంది గంగ. విడదీసి కలిపి, కలిపి విడదీసి ఆలోచిస్తుంది. మనిషి ఎక్కడ హద్దులు గీసుకుంటడు. ఎందుకుచెరిపేసుకుంటడు? అవసరాలు మనిషిని ఎంతదూరం నడిపిస్తాయి.?

స్టౌమీద పులుసు పొంగుతున్నట్టుంది. కమురు వాసన గప్పునలేచింది. గంగ గుర్తుపట్టలేదు. వాకిట్లో అప్పుడే అగిన స్కూటర్ చప్పుడును కూడా.

"గంగా....స్టౌమీద ఏముంది? వాసనత్తుంది" ఇంట్లోకి వస్తూ అడిగిండు రాములు. ఉల్కిపడి వంటింట్లోకి పరిగెత్తింది గంగ. పులుసుపొంగి స్టౌమీద గద్దెమీద మడుగు గట్టింది. శుభ్రం చేస్తుంటే వంటింట్లోకి వచ్చిండు రాములు.

"సద్దిపులుసు సగం పొంగినట్టుంది. మనం పండుగు చేసుకునుడు ఊరోళ్లకే కాదు. దేవుండ్లకు గూడా ఇష్టం లేనట్టుంది. అగ్గిదేవుడు పులుసునంతా నేలపాలు జేసిండు" నవ్వుతూ అన్నడు రాములు.

గంగ నవ్వలేదు " నాకొకటి మీరు లేని పని పెట్టింద్రు. నలుగురు నాలుగంటుంద్రు. ఎప్పుడూ బతుకమ్మలు మనకాలనీలనే పెడుదురు. మా బతుకమ్మలను మేము ఈనంగ ఇటే చెరువులకు తీసుకపోదుము. ఇప్పుడు సుట్టి ముట్టుదచ్చి మనకాలనీల ఎవ్వలు పేరుత్తలేరు. నన్ను బలవంతంగా పేర్పిచ్చి ఊర్లెకు తీసుకపొమ్మంటిరి. మీ పలుకుబడి నా మంచితనం ఏవీ పనిజేత్తలేవ్వక్కడ. మొన్న ఆరో రోజు అట్ల బతుకమ్మనాడు అందరిలెక్క నేను గూడా తెల్లపట్టుచీర కట్టుకుని బతుకమ్మను తీసుకపోయిన్నా!... నన్ను ఏరేసినట్టే చూసింద్రు. నా గౌరమ్మను ఎవలూ అందుకోలేదు. ఎవల గౌరమ్మను నాకియ్యలేదు. నేను అనుమండ్ల గద్దెను ఎక్కంగనే అందరు గుసగుసలు పెట్టుకుంట కిందికి దిగిపోయింద్రు. ఐదారుగురుండంగనే గట్ల జేసిరి! రేపు ఊరంత ఉంటరు. ఇంకేమంటరో!"

అన్నది బాధగా

"ఏం ...మాదిగోల్ల బతుకమ్మ ఊరోల్ల బతుకమ్మలల్లకలువద్దటనా... రేపు నీ ఎంబడే ఉంట. సద్దివట్టుకుని నేనేవస్త. ఎవలేమంటరో సూస్త." కోపంగా అన్నడు రాములు.

"ఏమంటరు! బయటికి అంటరా ఏంది? లోపల లోపల మసులుతరు. లత, రేణుక అంజవ్వ వార్డు మెంబర్లున్నరు నూడుండ్రి... ఎప్పుడన్న వంచాది ఆఫీసుకాడ కనవడితే సారమ్మా...సారమ్మా...అని తియ్యగ దేవినట్టు మాట్లాడుతరు. మొన్న బతుకమ్మకాడ ఏంబుట్టిందో... ఎంత మాట్లాడిచ్చిన సప్పుడులేదు సలిలేదు. " బాధగా అంటూ స్టౌను బట్టతో తుడిచింది. రాములు డ్రెస్ విడిచి లుంగీ కట్టుకుని వచ్చిండు. గంగ ఆలోచిస్తూనే పులుసును కలుపుతుంది.

" ఏం.ఇ.వో మల్ల ఫోన్ జేసిండు." ఆమెను మాటల్లోకి దింపాలని అన్నడు రాములు.

"ఎందుకు....?" డైనింగ్‌టేబుల్ సదురుతూ అడిగింది గంగ.

" అదే... స్కూలు సంగతి. సర్పంచ్ గూడా మస్తు బతిలాడుతుండు. ఉన్న ఒక్కసారు రిటైర్మెంటయిండు. విద్యావాలెంటర్ సక్కగ పోతలేడట. బడిమూతవడవట్టెనని బాధపడుతుండ్రు. అంగన్ బడి పొద్దునపూటనే గదా! పగటిపూట బడికిపోయి చెప్పుమంటండ్రు. నువ్వయితెనే ఓపికతో చెప్పుతవట." నవ్వించడానికి ప్రయత్నిస్తూ.

గంగ భర్తవైపు విసుగ్గా చూసింది. "ఊరు పనులన్నీ నాకే రుద్దుతరు. ఇప్పుడున్న పనులు సాలుతలెవ్వని బడికిపొమ్మంటుండ్రా. నాకు మీటింగులుంటయి. సర్వేలుంటయి. కలువదని ఎన్నడో చెప్పిన. " కోపంగా అన్నది.

రాములు విసుక్కోలేదు. నవ్వుతూనే " అహా... ఇప్పుడుజేత్తున్న పనులన్నీ నేనేరుద్దినగదా! స్వశక్తి గ్రూపులెక్కలు..... బ్యాంకులోన్లు.... ఆపిరేషన్‌క్యాంపులు.... మందులిచ్చుడు... దవాఖాన్లకు తోలుకపోవుడు... ఆడిపిల్లలకు సైకిలిప్పిచ్చుడు... సిలిండర్లిప్పిచ్చుడు... నీయిగాని పనులన్నీ నేనే రుద్దినగదా!" అన్నడు.

గంగ నిజమే అనుకుంది. ఊరికి తనవంతు సేవను అందించాలనుకుంది. ఊరునేదో బాగుచేయాలనుకుంది. హద్దులుచెరిపేసుకుని మరీ చొచ్చుకుపోయింది. ఊరు మాత్రం తనను వేరుచేసి చూసిందని ఇప్పుడు తెలుస్తుంది.

రాములు గంగనే చూస్తున్నడు. ఆమెలో మెదిలే భావాలను ఊహిస్తున్నడు. ఊరు ప్రజలు మారిపోయారని మనుధర్మకాలం చెల్లిందని తనూహించిన భావనలోంచి గంగ చెప్పిన మాటలను అంచనా వేసుకుంటున్నడు.

అప్పుడే ఫోన్ మోగింది. వెళ్లి ఎత్తిన రాములు ' గంగా....నీకే...మోహన్‌రెడ్డిబిడ్డ... ' అంటూ పిలిచిండు. వెళ్లి ఫోన్ అందుకుంది గంగ.

"హలో...సంగీతా బాగున్నవా? ఎక్కడినుండి" అడిగింది గంగ.

సంగీతకు కొత్తగా పెళ్లయింది. టెంత్ పాసయి ఇంటివద్ద ఉత్తగనేకూసుంటే గంగనే బలవంతంచేసి ఓపెన్ డిగ్రీలో చేర్పించింది.

"ఇక్కడినుండే. నిన్ననే వచ్చిన. నీతో పనుంది." బయటనుండి సంగీత.

"పనుంటేనే గదా నువ్వు ఫోన్‌జేసేది. ఇంతకు ఏం పని. దవాఖాండ్లకేనా....?"

"అవును. అమ్మనే వస్తనంటుంది. నేను నిన్నే తోలుకపోతనన్న. నువ్వయితే డాక్టర్‌ను వివరంగా అన్నీ అడుగుతవు." సంగీత చెప్పింది నవ్వుతూ. గంగ కాదనలేకపోయింది.

"సరే రేపు పండుగు గదా! ఎల్లుండి పోదాం. ఇంతకీ ప్రాబ్లమేంది?" గంగ అడిగింది.

సంగీత చెప్పలేదు. నవ్వుతూ మాటమార్చింది. కొద్దిసేపు మాట్లాడి ఫోన్‌పెట్టేసింది గంగ. అంతవరకూ అసహనంగా వింటున్న రాములు ఫోన్ పెట్టేయంగనే అన్నడు. "ఎల్లుండి ఏం పని పెట్టుకోకు మనింట్లనే మస్తుపనుంటది. ఎంపీపి జడ్‌పిటిసిలత్తరు."

"మీ ఎం.పి.టి.సిలకు ఏంపని లేనట్టుంది. ఎంపీపిని నెత్తినెత్తుకుని ఊరికోనాడు తింషతండ్రు" అన్నది విసురుగా.

" మన కాలనీల సి.సి. రోడు మోరి పనులు చూసి పోనీకి వత్తండు. కాంట్రాక్టు నాకే ఇచ్చిండ్రు గదా! ఎదన్నా చిన్నగ దావత్ జెయ్యాలె." డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంటూ అన్నడు రాములు.

భర్తవైపు వింతగా చూసింది గంగ. ఈ ఆలోచన ఇంతవరకెప్పుడు రాలేదు. ఇప్పుడెందుకో మనుషులంతా మొకాలకు రంగేసుకున్నట్టు...నాటకంలోని పాత్రల్లాగా కనబడుతున్నరు.

"మటన్...చికెన్...రొట్టెలు...అన్నంవండుడుకు మనిల్లుగావాలె. కూసుండి తినుడుకు మాత్రం సర్పంచ్ ఇల్లో, రెడ్డీల ఇల్లోగావాలె. ఎంపీపికి మీ ఓటు గావాలె. మీ తిండి గావాలె. మీ ఇంట్లో కూసుండి తింటే మాత్రం నామోషి. ఏం మనుసులండీ...వాళ్లు విడదీసి పోషించే భావ జాలాలనే మీరు గొప్పగా నెత్తి కెత్తుకుంటరు." విసురుగా అన్నది. గంగ కోపంగా.

శిక్కులోని పల్లాన్ని అందుకోబోతూ ఆగిపోయిండు రాములు. గంగ మాటలు మామూలుగా కాకుండా నిలదీసి అడుగుతున్నట్టుగా అనిపించినయి. ఒక్కోసారి చెంపమీద కొట్టినట్టుగా ఉంటయి. తను గుర్తించని సూక్ష్మమైన అంశమేదో గుర్తు చేసి చెబుతుంది. కాని అవెందుకో రాములుకు సీరియస్‌గా అనిపించవు. అనవసరంగా ఆవేశపడుతుందనుకుంటడు.

"నీవన్నీ ఉత్త పాతకాలపు ఆలోచనలే! ఏదేదో ఊహించుకుని నీకు నువ్వు ముడుసుక పోతవు. ఎప్పుడో ఉన్నట్టు ఇప్పుడు అంటు ముట్టు ఉన్నదా! అప్పుడు బతుకమ్మను పేర్చుకుని ఎత్తుకపోయిండ్రా..? మన ఊరు సంగతే చూడు. నిన్నూ నన్నూ ఎంతమంది గౌరవించరు? ఊర్లెకు

బోతే నమస్తె వెడుతరు. ఇండ్లళ్లకు బోతే కుర్చిమీద కూసోమంటరు. అందరూ మనను సమానంగనే చూస్తరు. మనమే లోలోపల తొక్కుకుంట మార్పును జీర్ణించుకోలేక పోతున్నం. ఇప్పటికి మనకు మనం తక్కువగా అంచనా వేసుకుంటున్నం." అన్నడు రాములు.

అతడివైపు పరిశీలనగా చూసి విరక్తిగా నవ్వింది గంగ. అతడికి ఎలాచెప్పాలో అర్థంకాలేదు. ఎలా చెప్పినా అంతకు మించి లోతుగా ఆలోచించడని కూడా తెలుసు. అతడికి అన్నం పెడుతూ "సమానంగా చూడడం ఒక నెపం మాత్రమే. గౌరవంగా చూడడమన్నది ఒక అవసరం మాత్రమే! నువ్వు ఎంపిటీసివి. నేను అంగన్‌వాడీ టీచర్‌ని. మనతో వాళ్లకు కొన్ని పనులుంటయి. వాటిని చేయించుకోవడానికి అప్పటికప్పుడు రంగుపూసుకుంటరు గనీ మీరనుకున్న మార్పు వచ్చికాదు." అన్నది.

అన్నం కలుపుతూ రాములు నవ్విండు. " ఈ పొల్టికల్‌సైన్సే నీ కొంపముంచింది. డిగ్రీలో చేరిన్నుండే నీకీ ఆలోచనలు మొదలయినయి. అంతకుముందు ఎడ్డి దానిలెక్కుందువు. ఇప్పుడు ప్రతీది బూతద్దంలో చూస్తున్నవు."

అప్పుడే ఎనిమిదేళ్ల కూతురు బయటనుండి పరుగెత్తుకచ్చింది. తండ్రిని చూడంగనే కాళ్లు చేతులు కడుక్కుని నాకు అన్నం అని టేబుల్ దగ్గరికచ్చింది. ఆమెను కూసోబెట్టి అన్నంపెడుతూ అన్నది గంగ.

"గరుకగడ్డి వేర్లుంటయి చూసింద్రుగదా! మట్టిలో ఎక్కడ కనిపించకుండా ఏమూలనో అణువంతదాక్కుంటయి. ఎండకాలం వచ్చిందంటే భూమంతా దుమ్ముదుమ్ముగా మారి గడ్డివేర్ల ఆనువాళ్లే కనిపించయి. మనం అసలు దాని మూలాలే లేవనుకుంటం. ఒక వాన వడి భూమంతా తడిసిందనుకో! అదుగుసందులేకుంట మొలుకెత్తుతుంది. పీకేసి మట్టినంతా కిందిమీద చేసినా ఎక్కడినుండో మళ్లా మొలికెత్తుతుంది. ఈ మనుధర్మ సిద్ధాంతముంది చూసింద్రా! అదికూడా అంతే! మనుషుల్లో జీర్ణించుకపోయింది. మనకు ఎక్కడా ఉన్నట్టు అనవాళ్లు కనిపించయి. కారంచేడు మొదలుకొని ప్యాపిలీదాక ఇలా జరగడం చూస్తున్నదే కదా!" అన్నది.

అన్నం కలుపబోతూ మళ్లీ ఆగిపోయిండు రాములు. గంగ ఎప్పుడూ అతనికి ప్రశ్నలాగే మిగిలిపోతుంది. ఇంత తీవ్రమైన ఆలోచనలున్న వారు సమాజంలో అంతకలుపుగోలుగా ఉండరు. సీరియస్‌గా ఉంటరు. మనుషులతో అంత తొందరగా కలువరు. రాజీపడరు. గంగ అట్లాకాదు. అందరినీ కలుపుకపోతుంది. మామూలుగానే కనిపిస్తుంది. ఆ మాటలు ఆమె నోటివెంట వింటే తప్ప అంత సీరియస్‌గా ఆలోచిస్తుందని ఎవరూ అనుకోరు.

ఇంతకుముందు అదే విషయం గంగతో అంటే 'ఆలోచించడం వేరు, సంబందాలు కొనసాగించడం వేరు. అయినా సంబందాలు నేను కొనసాగించడం కంటే నాతోనే వాళ్లు కొనసాగిస్తున్నరు. నేను వేరు చేసి చూడడంకంటే అవసరాలతో నన్నే వాళ్లు వేరు చేసి చూస్తున్నరు.

మీ దోస్తుల భార్యలనే తీసుకోండి. హస్పిటల్‌కో బ్యాంకుకో పిలిచినంత ప్రేమగా ఒత్తిడిగా పసుపుబొట్లకో ఫంక్షన్లకో పిలువరు. మన పిల్లలను వాళ్ల ఇంటికి తీసుకపోయినంత ఇష్టంగా వాళ్ల పిల్లలను మనింటికి పంపరు' అన్నది.

"రామన్నా..." పిలుపుతో ఇద్దరూ ఉలికిపడ్డరు. గంగ బయటకు తొంగిచూసింది.

"ఇగో...గునుకపువ్వు బాగ తెమ్మంటివి గదా! అంత ముదిరినదే తెచ్చిన. లోపల నాలుగు దోసకాయలున్నయి" ఒక వ్యక్తి మోపును దించిపోయిండు.

ఏదో గుర్తుకచ్చినట్టు "రేపు బతుకమ్మను పేర్వక తప్పదంటరా...? ఇక్కడ ఎవలూ సోపతి లేరు. కొండవోవాలంటే మనుసొప్పుతలేదు. అందరూ నన్నే చూస్తరు. ఎక్కడికని కొండవోవాలె అన్నది బిడ్డకు మరింత అన్నం పెడుతూ గంగ.

ఆమెగొంతులో వినిపించిన బాధను గుర్తుపట్టిండు రాములు. మారన్నం పెట్టుకుంటూ అన్నడు. "ఏం...నీకు సోపతికరువా...? ఊర్లెనీకు తెలువనోళ్లు ఎవరున్నరు. కోమట్లవాడకు తీసుకపో. లేకుంటే రెడ్డిలవాడకు తీసుకపో. మున్నూరుసంగం దగ్గెరికిపో. గరిసెలగడ్డ, పెద్దమ్మవాడ, కోటగడ్డ, కచీరుకాడ, యాడికన్న తీసుకపో. నీఎంబడే నేనుంట. పెద్దబతుకమ్మ నేనెత్తుకుంట. గౌరమ్మ నువ్వు పట్టుకో. చిన్నదానికి సద్ది డబ్బ. ఎవలేమంటరో... ఎవలు వద్దంటరో చూస్త."

"ఈ కొట్లాట పంచాదెందుకు వాళ్లు ఒకటన మనం ఒకటన.... ఈ చిన్న విషయం ఊరుకు చిచ్చుపెడుతది. మనం బతుకమ్మ పేర్వకపోతే అలిగిపోతదా!...వద్దుతియ్యి." సర్దిచెబుతున్నట్టుగా అంది గంగ.

మరోసారి ఆమెవైపు ఆశ్చర్యంగా చూసిండు రాములు. ఈమాటలతో మళ్లీ గంగ ప్రశ్నలా మారింది. ఆమె తీవ్రమైన ఆలోచనలకు, అంతకంటే తొందరగా వచ్చేరాజీకి ఎక్కడా పొంతన కనిపించదు. అట్లాగని అది రాజీపడటమంటే ఆమె ఒప్పుకోదు.

"గంగా... నీ మాటలు వింటుంటే నాకో కథ గుర్తుకొచ్చింది." చేయి కడుక్కుంటూ అన్నడు రాములు.

"ఏమిటో కథ" పాపకు పెరుగు పోస్తూ అన్నది.

" ఓ సత్రంలో సత్సంగ్ జరుగుతుందట. ఓ పది ఇరువైమంది బ్రాహ్మలు కట్టెలు కొట్టడానికి నీళ్లుమొయ్యడానికి బోళ్లు కడుగడానికి ఇద్దరు కూలీలను పెట్టుకున్నరట. మడిమీదున్న బ్రాహ్మలు ఎప్పుడో ఏ పని మీదనో కూలీలను తాకుతున్నరట. వాళ్లను ముట్టుకున్నందుకు మడి మార్చడం తప్పనిసరి.

ముట్టుకోవడం మడిమార్చడం... ఎంత జాగ్రత్తగా మసులుకున్నా గుర్తుకులేక కూలీలను అంటుకుంటున్నరట. ఇదో పెద్ద సమస్యగా మారి గురువుగారి దగ్గెరికెల్లి మొరవెట్టుకుంటే మీరు

జాగ్రత్తగా ఉండడమే ఏకైక మార్గమని చెప్పిండట.

ఎంత జాగ్రత్తగా ఉందామన్న అవసరాలు బ్రామ్మలను ఉండనీయడంలేదు. ఎ వస్తువును తెమ్మనో ఏ పనినో చెప్పి తాకడం, తర్వాత బాదపడడం మామ్మూలైపోయింది. ఇది గమనించిన తెలివైన శిష్యుడోకడు ఇద్దరు కూలీలను పిలిచి మిమ్మల్ని వాళ్లు తాకినా వాళ్లను మీరు తాకినా మీరే పాపాన్ని ముల్లెగట్టుకున్నట్టు అని హితబోధ చేసిండట. అప్పటినుండి బ్రామ్మలు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నా కూలీలే జాగ్రత్తగా మసులుకుని వాళ్ల మడి మార్చే బాధలు తప్పించింద్రట." చెప్పిండు సోఫాలో కూర్చుని.

పాపకూడా లేచింది. ఆదర బాదర చేయికడుక్కుని బయటకు పరుగెత్తబోతుంటే పట్టుకచ్చి మూతి చెయ్యి శుభ్రంగా కడుగుతూ అన్నది గంగ.

"ఇప్పుడు.... ఈ కథ ఎందుకు గుర్తుకచ్చింది."

"మనం వాళ్లతో కలవడం తప్పు అన్న భావన మనలో ఉన్నంతవరకూ వాళ్లు సేఫ్టీనే! సామాజికంగా ఎదిగిన మన ఆలోచనలే ఇట్లుంటే ఇంకా హీనంగా ఉన్నవాళ్ల ఆలోచనలు ఎట్లుండాలె." అన్నడు.

"అర్థిక ఎదుగుదల సామాజికపు హోదాను పెంచుతుందేమోకాని...సమానత్వాన్ని కలిగిస్తుందని ఏనాడూ నమ్మను. సమాజం ఎప్పుడో ఎక్కడో మనని కులం పేరుతో ముడివేస్తనే ఉంది. ఈ వేర్లు... ఈ సామాజికపు మూలాలు సాంఘీకపు ఎదుగుదలతో తెగిపోవు." పాపను బయటికి పంపుతూ అన్నది గంగ.

ఎప్పుడో పోయిన కరెంటు వచ్చింది. రాములు టీ.వి పెట్టిండు. గంగ డైనింగ్ టేబుల్ సర్దుతుంది. టీ. వీలో ముఖ్యమంత్రి సహపంక్తి భోజనం చేస్తున్నడు. ముసలమ్మ నోటికి ముద్దను అందిస్తున్నడు. నవ్వుతూ ఫోటో దిగుతున్నడు.

"అసలు ఈ సమస్యను పెంచి పోషించేది నాయకులే! సమస్యలేకపోతే ఓట్లు రాలవని వాళ్లకు తెలుసు. ఎవరి ఆరాటం వాళ్లది." టి.వి ముందుకచ్చి నిట్టూరుస్తూ అన్నది గంగ.

"ఏది ఏమైనా బతుకమ్మ పేర్చుడు పేర్చుడే... ఊర్లెకు తీసుకపోవుడు తీసుకపోవుడే" రాములు అన్నడు. " ఊరు మారింది. అన్నిట్లోమనని కలుపుకుని పోతున్నరు. మనమే వాళ్లతో కలిసి నడువడంలేదు."

"ఏమో... నాకంతగా ఇంట్రెస్ట్ లేదు." అనాసక్తిగా అన్నది గంగ. పైకి అలాఅంది కానీ లోలోపల భయంగానే ఉంది. అదే విషయం పసిగట్టినట్టుగా అన్నడు రాములు.

"ఇంట్రెస్ట్ లేక కాదు. బయపడుతున్నవు. ఆర్థిక వెసులుబాటు కలిగి ఆలోచించే స్థితిలో ఉన్న మనమే సాంఘీక సంస్కరణలను, సాంస్కృతిక ఆధునీకరణ ప్రక్రియలను చేపట్టాలే. లేకుంటే

ఆధిపత్యవర్గాల ప్రయోజనాల్ని కాపాడే భౌతిక వనరులుగా మారి మనకు మనమే శత్రువులుగా మిగిలిపోతం."

గంగ మాట్లాడలేదు. మౌనంగా కూర్చుంది. సామాజిక నియమాలను దిక్కరించకుండా ఉత్పత్తిశక్తులుగా ఉపయోగపడేంతవరకు అంతా ప్రశాంతంగనే ఉంటది. ఎక్కడ చిన్న దిక్కారం చూసినా, ఎక్కడ కట్టుబాట్లను దాటినా అధికారానికి అద్భుతలిగినా ఊరు చుందూరవుతుంది అనుకుంది. భర్త ఏదో భ్రమలో ఉన్నాడని కూడా అనుకుంది.

ఆధునీకీకరణ అన్నింటా వేగంగా సాగినా కులం వద్ద ఎందుకు కదులలేకపోయిందో అది ఎక్కడ ఎందుకు ఆగిపోయిందో పైకి ఒక విధంగా లోపల మరో విధంగా ఎందుకు కనిపిస్తుందో ఆలోచిస్తుంది గంగ.

ఆమె సీరియస్‌గా ఉండడం చూసి "నువ్వు ఊకెనే నీడను చూసి భయపడుతున్నవు. ఈ సమాజం నువ్వు అనుకుంటున్న ఆలోచనల స్థాయిని ఎప్పుడో దాటింది. ఇప్పుడు మనవాడలల్లగూడా గణపతులను పెడుతున్నం. తెలుసు గదా" అన్నడు రాములు.

అతడివైపు తీవ్రంగా తలెత్తిచూసింది గంగ. మరుక్షణమే అతడి ఆలోచనలకు నవ్వు వచ్చింది. "గణేశ్ పండుగులు ఆదిపత్య బావజాలాలను విస్తరింపజేయడం మాత్రమే! ఇవన్నీ ఎందుకు...? మీరు అనుకున్నట్టు ఊరు ఉంటే మొన్న ప్రైమరీ స్కూల్ మధ్యాన్నభోజనం వండుడు ఎస్సీ మహిళా స్వశక్తి సంఘానికి ఇస్తే ఎందుకు లొల్లి జరిగింది?" అడిగింది.

రాములు ఆ విషయాన్ని సామాజిక అసమానతల్లోంచి కాకుండా వ్యక్తిగత కారణాల్లోంచి చూస్తున్నడు. వ్యక్తిగత కక్షలకు అసమానతలు కూడా కారణమే అంటుంది గంగ. కొద్దిసేపు వాదించుకున్నరు.

ఇద్దరూ వేరువేరుగా ఆలోచించినా చివరికి బతుకమ్మను పేర్వాలన్న ఒకే నిర్ణయానికి వచ్చింద్రు.

*****

పట్టుచీర కట్టుకుని బతుకమ్మ నెత్తుకుంది గంగ. తీరొక్కపువ్వుతో బుద్దిదీరా పేర్చుకుంది. పెద్ద తాంబోలం. సగం కంటే ఎక్కువ తంగేడుపువ్వు! గునుగు రెండు చుట్లు తింపి కాయిదం పూల బతుకమ్మ పెట్టి గొడుగుకట్టింది. కిందినుంచి పైకి దారంతో కట్టి ఊదుబత్తీలు ముట్టించింది.

కూతురు చిన్న తపుకులో గౌరమ్మను పట్టుకుంది. రాములు మలీదముద్దలు దోసకాయపప్పుసద్ది పట్టుకున్నడు. తల్లీకూతుర్లను ముందుగా పంపి తను తర్వాత స్కూటర్ మీద వస్తానన్నడు.

డాంబర్ రోడ్డెంట అరకిలోమీటర్ నడిచి కొత్తబస్టాండుకు వచ్చింది గంగ. అప్పటికే అక్కడ రెండుచోట్ల బతుకమ్మలను పెట్టింద్రు. ఒకచోట ఆటసాగుతుంది. మరోచోట జనం గుమిగూడి మాట్లాడుకుంటున్నరు.

గంగను చూడంగనే అందరూ గుసగుసలాడుకుంటున్నరు. కొందరు కొత్తగా, విచిత్రంగా చూస్తున్నరు. చూసికూడా చూడనట్టే ఆటసాగని గుంపు దగ్గర బతుకమ్మను దించింది గంగ. అన్నిట్లోకి తనదే ఎత్తుగా గుండ్రంగా చెక్కినట్టు అందంగా ఉంది. తనని చూపులతో వేటాడుతున్న మనుషులను మూగసాక్షులుగా ఉన్న బతుకమ్మలను ఒకసారి చూసి కూతురు చేతిలోని గౌరమ్మను అందుకుని బతుకమ్మ పక్కనేపెట్టింది గంగ.

నిశబ్దంగా ఉన్న నీళ్లలో రాయిపడింది. ప్రశాంతంగా ఉన్న మందలో తోడేలు పడింది. చెదిరిన అలల్లా బెదిరిన మేకల్లా జనం. కొందరు అసూయగా...మరికొందరు అసహ్యంగా... అసహనంగా.

అన్నీ పరిచయమున్న మొఖాలే! అందరు మాట్లాడినవారే! కొందరైతే తనతో పనిచేయించుకుని లాభం పొందినవారే! కొందరు "గంగక్క" అని వెంటతిరిగినవారే. గంగ కలుపుగోలుగా దగ్గరికెళ్లింది. ఎన్నడూ ఎరుగనట్టు వాళ్లే దూరంగా జరిగింద్రు. తమలో తాము ఏదో గొనుక్కుంటున్నరు.

విజాతి ధృవాలకలయిక. అది ఏ అంతర్లీనసూత్రమో! ఏ మూల సిద్ధాంతమో ! ఎప్పుడో తెగినవనుకున్న మూలాలు జీవం పోసుకుంటున్నయి. ఏదో హోదాను ఆమెకు అందకుంట చేయడానికి అందరూ ఏకమౌతున్నరు. కొందరు మొహమాటంగా తప్పుకుంటే కొందరు ముక్కుసూటిగా తప్పుకుంటున్నరు. తప్పుకున్న వాళ్లంతా తప్పుకతిరిగే తనాన్ని కప్పిపుచ్చుకుంటున్నరు.

గంగ ఒంటరిదయింది."అందుకే కాలాలు ఇట్లేడిసినయి. వానకాలం ఎండకాలమైతంది. ఎండకాలం వానకాలం అయితంది." వెనుకనుండి ఎవలో అంటున్నరు. కూతురును దగ్గరకు తీసుకుని పద్మవ్యూహంలో నిలబడినట్టుగా నిలబడింది గంగ.

విచిత్రంగా అక్కడ ఒక్కొక్క బతుకమ్మలేస్తుంది. లేచిన బతుకమ్మ మరో గుంపులో కలిసిపోతుంది. టిఫిన్ డబ్బాలతో అరుగులమీదకూసున్న మగవాళ్లను ఆడవాళ్లు చూపులతో ఆజ్ఞాపిస్తున్నరు. బతుకమ్మల మధ్య ఒదిగి కూసున్న పిల్లలు భయంతో పరుగుతీస్తున్నరు.

ఫ్యూడల్‌భావన ఊరును గంగను వేరుచేసింది. అదేభావన ఊరు ఊరునంతా ఏకం చేసింది. అక్కడ విభజన రేఖను స్పష్టంగా గీసింది. తనపక్కనుండే మరో గుంపులోకి వెళ్తున్న బతుకమ్మలను విచిత్రంగా చూసింది గంగ.

రామరామరామ ఉయ్యాలో....రామనే సీరామ ఉయ్యాలో ॥రా॥

వాడ వాడల్లోన ఉయ్యాలో కొమటి వాడల్లోన ఉయ్యాలో ॥వా॥

కొమటివాడల్లోన ఉయ్యాలో గౌరు బయిలెల్లింది ఉయ్యాలో ॥కొ॥

వాడవాడల్లోన ఉయ్యాలో కాపువాడల్లోన ఉయ్యాలో ॥వా॥

కాపువాడల్లోన ఉయ్యాలో గౌరు బయిలెల్లింది ఉయ్యాలో ॥కా॥

పాట సాగుతుంది. చప్పట్లు మోగుతున్నయి.

ఆటకు తొవ్వదీసే కాపోల్ల పెద్దమ్మ, పాటపాడే కమ్మరోల్ల చిన్నమ్మ, చేతులు కలుపరాని కుమ్మరోళ్ల కొత్తకోడలు, కాళ్లు కలుపరాని అవుసులోళ్లపిల్ల, తయారయివచ్చి ఆట మోటని అరుగులమీద కూసున్న రెడ్డీలపిల్ల, కోడండ్లను ఎంటేసుకుని ఆడుతున్న బెస్తొలమ్మ...అన్ని కులాలను ఏకం చేసి బతుకమ్మ ఆడిస్తున్న సూత్రమే గంగను వేరుగా ఉంచింది.

ఒక్క గంగ బతుకమ్మనే బజార్లమిగిలిపోయింది. కొత్తగా తెచ్చేవారైనా తన పక్కన పెడుతారనుకుంటే అక్కడిదటే మరో దగ్గర పెట్టుకుని ఆడుతున్నరు. చిన్నపిల్లకు అర్థమయికానట్టుంది. తల్లివైపు దిగులుగా చూసింది. గంగ కండ్లల్ల నీళ్లు తిరిగినయి. ఏడువేదువున దుఖమచ్చింది.

"నీ ఊరుపాడుగాను. ఊకెనన్న పేరిత్తి. నన్ను ఉన్నజాగల ఉండనియ్యక బతుకమ్మను పెట్టె! వీళ్లదేదో గుంజుక తిన్నట్టు దూరం దూరం బోతండ్రు. పనివడ్డనాడు ఎంతమంది ఎన్నిసార్లు ఇంటిమూడు సుట్లు తిరుగలేదు. ఇప్పుడెట్ల..?" అనుకుంది గంగ. భర్త కొరకు చూసింది. కనిపించలేదు.

గంగ మొండి ధైర్యంచేసి బతుకమ్మను ఎత్తుకుంది. గౌరమ్మను కూతురుకిచ్చింది. "ఎట్లయినా సరే! ఇప్పుడు ఎటువోతరో సూత్త. ఇదొకపేరే ఉండాలె. ఎందుకు పోతున్నరని నీలదీసి అడుగుత. అనుకుని ఆడుతున్న గుంపువైపు నడిచింది. సందుపాయజూసి మధ్యలోకి వచ్చి బతుకమ్మను అంచుకు దించింది. పక్కనే గౌరమ్మను పెట్టింది.

అనుకున్నట్టు గుంపు చెదిరిపోలేదు. ఆడుతనే తనను పట్టి పట్టి చూస్తున్నరు. పాట పాడే చిన్నమ్మ కొద్దిసేపు ఆపి పాటను లగాయించి ఎత్తుకుంది. అప్పుడే అక్కడికి రాములు వచ్చిండు. వచ్చి అరుగుమీద కూసున్నడు.

గంగకు కొద్దిగ ధైర్యం వచ్చింది. గుండ్రంగా తిరుగుతూ బతుకమ్మ ఆడుతున్న మందిని ఒకసారి పరీక్షగా చూసింది. అందరూ పరిచయమే! కానీ కొత్త మనిషిని చూస్తున్నట్టు చూస్తున్నరు. తనతో చనువుగా ఉండే శాలోల్ల పద్మ పక్కన సందు జేసుకుని జోడి పట్టింది గంగ. పద్మ కొన్ని క్షణాలు దురుసుగా చూసినా నవ్వుకుని సదురుకుంటూ 'నీకు ఆడస్తదా?' అన్నది.

అది ఒక ప్రశ్నలా కాదు. నీలదీసి అడుగుతున్నట్టుగానే అనిపించింది. ఇష్టంలేనితనాన్ని సూటిగా చెబుతున్నట్టుగానే అనిపించింది. గంగ చిరునవ్వుతోనే సమాధానం చెప్పి చేతులు కలుపుతూ పాటను అందుకుంది.

ఏమనుకుందో పద్మ. రెండుచుట్లు తిరుగంగనే పక్కకు జరిగింది. ఆటసాగుతనే ఉంది. ఈ సారి గంగ పక్కన వెంకటమ్మ. రెండు చుట్లు తిరిగిందో లేదో ' ఆటపాడుగాను. ఆడినసింగారం లేదు. ఆడని సింగారం లేదు. బమ్మంగారన్నట్టు తేజిపాజిగావట్టె. పాజి తేజిగావట్టె.' అంటూ పక్కకు

తప్పుకుంది.

ఇప్పుడు పక్కన కాపోల్లమంజుల. కొత్తగా ఆటనేర్చుకుంటుంది. గంగతో చేతులు కలుపరాక, నేర్చుకునుడు ఇష్టంలేక పక్కకు వచ్చింది.

గంగ మనసు ఆటమీదలేదు. ఆడే మనుసుల్లో కదులుతున్న భావన పైనే ఉంది. భర్త పలుకుబడో, తన మంచితనమో అక్కడ మందిలో తనను కలుపలేకపోతుందని తెలిసిపోయినంక... ఒక కట్టుబాటును తాను దాటి వచ్చింనందుకు తనను దోషిలా చూస్తున్నరని తెలిసిపోయినంక...చనువు, పరిచయాలు, సహాయం అవసరాలు తీర్చడం, ఆపదలకు ఆదుకోవడం, మందులివ్వడం లాంటి పనులు తనను వాళ్ల పక్కన నిలబెడతాయన్న ఆలోచన వట్టిదే అని తెలిపోయింది.

"కాలు దొక్కకు...." గద్దింపు తెరుకుంది గంగ.

పక్కన ఓ నడీడు మనిషి. నుదుటి మీద రూపాయి బిళ్లంత బొట్టు. చెవులకు గంటీలు కత్తెర్లవైనీలు. ముక్కుకు ముక్కుపోగు. మెడలో నాను. దండె కడాలు. గుడిలో అమ్మవారి లెక్కుంది తెనుగోల్ల బాలమ్మ.

".....మాదిగి గావురం ఎన్నగాల్చుకతిన్నదట. పతాకం కాళ్లనే తొక్కవడితివి...."ఆట ఆపకుండానే అన్నది.

"నేనెక్కడ తొక్కిన. నీకు తాకనన్న తాకిన్నా...?" అర్థంగాక అడిగింది గంగ ఆట ఆపకుండానే. అప్పటికే గుంపు చిన్నగయింది. తప్పుకున్నోళ్లు తప్పుకున్నట్టు మరో దగ్గర ఆట మొదలువెట్టింద్రు.

"తొక్కనే వడితివి. మల్లాయాడ తొక్కిన్నని దబాయించవడితివి. నీకు సిరిమంతముంటే నీ దగ్గరనే పెట్టుకో... ఈడ జూపియ్యకు...." ఆడే ఆటను ఆపి గట్టిగా అన్నది బాలమ్మ.

ఆట ఇచ్చుకపోయింది. గంగకు ముందుగా ఏమి అర్థం కాలేదు. తర్వాత గెలికి కయ్యం బెట్టుకున్నట్టుగానే అనిపించింది. మాట పెకలలేదు.

"ఇగో....వట్టిగ మాటలనకు. మాటలంటే మర్యాదుండది. నువ్వు కావాలని కయ్యం బెట్టుకుంటున్నవు." అన్నది గంగ. వాళ్లిద్దరూ బతుకమ్మలయింద్రు. మంది చుట్టు జమకూడింద్రు.

"ఏఊరే....నీది. ఏవాడ ఏపల్లే....యాడికచ్చినవు. ఊర్లెకచ్చి లావులావు నీల్గుతున్నవు."బాలవ్వ యారాలు ఉరికచ్చింది.

"ఏం....ఊర్లెకచ్చి నీదేమన్న ఎత్తుక పోతున్ననా...." గంగ సమాధానం.

ఆటలన్నీ ఇచ్చుకపోయినయి. అందరూ గుంపు గూడింద్రు. మొగోళ్లు అరుగులెక్కి చూస్తున్నరు. రాములుకు సందు దొరుకుతలేదు. ఏం జరిగిందో తెలియదు కాని ఏదో జరిగిందని మాత్రం తెలిసిపోతుంది. అటూ ఇటూ పతుకులాడుతుండు.

"నువ్వే కాలు తొక్కుతవు. అట్లెందుకంటే మీదికి ఎగవడుతవు. నోరున్నదని బుద్దున్నట్టు మాట్లాడుతవు. మీ ఇండ్లళ్ల మీరు పెట్టుకోనుంటిరి. ఇక్కడికి ఎవలురమ్మన్నరు. మా జాగలకు వచ్చుడుకు నువ్వెవలు...? నిన్ను ఎవలు రమ్మన్నరు." బాలవ్వకు సపోటుగా మరో మనిషి.

"కాలులేదు. ఏలులేదు. నేను వచ్చుడే తప్పున్నది మీకు. నేను వస్తే మీ బతుకమ్మలు అరిగిపోతున్నయా...? "గాయికెత్తుకున్నట్టుగా అన్నది గంగ. రాములు ముందుకు రావాలనుకుంటున్నడు. ఎవలో వెనక్కితోస్తున్నరు.

"ఇప్పుడు ఇడిసిపెడితే అలుసైపోతము. ఇయ్యాల్ల బతుకమ్మ తెచ్చింది. రేపు ఇయ్యామందుతనంటది. ఇంకొకలు ఇటువంటి పనిజెయ్యకుంట గట్టిగనే జెయ్యాలె. పైసకావురం కాకపోతే బతుకమ్మను దెచ్చి పెద్దచిన్న లేకుంట మన బతుకమ్మల కటుపుదేందట...." వెనుకనుండి ఎవరో మాట.

మనిషికొక మాట. అందరికీ గంగనే ప్రత్యర్థి. నిలదీసినట్లుగా అడుగుతున్నరు. ఎప్పుడు ఎక్కడ అలజడి జరిగినా, దళితులు గీతదాటినా అదుపులో ఉంచేది ఎవరన్న విషయాన్ని గంగ లోతుగా ఆలోచిస్తుంది.

ఇంకా ఏం మాట్లాడినా వాళ్లు ఏదైనా చేసేతట్టున్నరు. ఆవిషయం గ్రహించేలోపే అక్కడికచ్చిండు రాములు. గంగను చేయిపట్టి బయటకు గుంజుకచ్చిండు. అతడు కోపంగా ఉన్నడు.

బాలమ్మ తిడుతనే ఉంది. మిగతావాళ్లు ఆమెకు అగ్గిపొగ వేస్తనే ఉన్నరు.

"ఇక్కడ రక్తం ఏట్లాడాలె. నన్నెవడు బతుకమ్మను వద్దనటానికి. బాజాప్త దెత్తం. బాజాప్తగ ఆడుతం." బయటకువచ్చినంక అరిచినట్టుగా అన్నడు రాములు.

ముందు కోపం వచ్చింది కానీ ఇప్పుడు జాలేస్తుంది గంగకు. బాలమ్మ బాలమ్మలా కాకుండా ఎవరికో కావలికాస్తున్నట్టుగా కనిపించింది. వెనుకనుండి ఆమెను ఎగదోసిన శక్తులు కనిపించినయి.

"బాలవ్వ పాత పగ తీసుకుంటుంది. ఎలక్షన్లల్ల ఆమె మొగడు నాకు అపోజిట్‌గదా. ఆ పగను ఇప్పుడు చూపిస్తంది. అవన్నీ ఏమీ నడువయి. నువ్వెంతనో నేనంత. యాడిదాకంటే ఆడిదాక సై..... నీ దమ్మెంతనో సూత్త. ఒక్క పదినిమిషాలు ఆగుండ్రి. మావోళ్లొత్తరు. వచ్చినంక మీ సంగతి చెప్తుతరు..." రాములు అంటున్నడు.

కోపంతో ఊగిపోతున్న భర్తను సముదాయించింది గంగ.

"ఇక్కడ లొల్లి వద్దు కొట్లాట వద్దు. మనంతల మనం ఎల్లిపోదాం. మన మంది వచ్చుడు, వాళ్లమంది వచ్చుడు... ఇక్కడనే లొల్లిపుట్టుడు... ఏదీవద్దు. ఈ కులం ఎంతలోతుల ఉంది చూసిండ్రు గదా! ఏం గాదు నేనుంటనంటిరి. ఎవలుంటే ఏం జేత్తం... వాళ్ల నరనరాలల్ల ఈ గుణం ఉండంగ..." భర్తనోచేత కూతురునో చేతపట్టుకుని ముందుకు నడిచింది గంగ.

" ఈ బాలి చూసినావు. కల్లంల దొంగతనం చేసిన్నాడు దీని మొగన్ని తంతం గుద్దుతమంటే నేనే కాపాడిన. ఊర్లెకు పోలీసోల్లో మండలాపీసోల్లో వస్తే పాపం బతుకననీ దీన్నేఇస్తార్లు తీసుడుఏసుడుకు పిలిచిన. మొన్న....సర్పంచ్ ఇంటికాడ ఎవలనో ఎమో అన్నదని కొట్టకొట్టవోతే నేనే ఆపిన.... ఎంగిలి ఇత్తార్లు ఎత్తిపోసేది. వాళ్ల వీళ్ల వాకిండ్లు నూకి బతికేది. నన్ను ఊర్లెకు రావద్దంటదా...? దీనినే సగం ఊరు అంటనియ్యరు ముట్టనియ్యరు. గైను దాటనియ్యరు....." ఆవేశంగా అంటున్నడు రాములు.

సమాజంలోమేజారిటీ వర్గంను ముందుకు నడిపి ఎనుక పగ్గాలు బిగించి పట్టుకున్నదె వరో గంగకు తెలుసు.ఎవరిని ఎవరి మీదికి ఎగదోసి ఎట్లెట్ల ఆడిస్తున్నరో గూడా తెలుసు.

"వీళ్లు మనను ఎల్లగొట్టుడేంది...మనమే వీళ్లను ఎల్లగొడుదాం. వీళ్లు దూరముంచుడు గాదు. మనమే వీళ్లను దూరముంచుదాం." అంటూ బతుకమ్మ దగ్గరికెళ్లింది గంగ.

తాంబోలంలో, తపుకులో.....ఒక్క పువ్వులేదు. పైన కట్టిన గొడుగు ఎక్కడనో ఎగిరిపోయింది. కాగితంపూల బతుకమ్మ బోర్ల పడ్డది. బతుకమ్మ ఇచ్చుకపోయింది. గంగ నోరు తెరిచింది.

అప్పుడే దప్పులు మోగినయి. ఆదరబాదరగా అందరూ బతుకమ్మలు ఎత్తుకుంటున్నరు. గంగ బతుకమ్మ మట్టిలో కలిసి కాళ్లకింద నలుగుతుంది. దుమ్ములో దుమ్మయి లేస్తుంది.

రాములు తేరుకోలేదు. " భక్తితో నెత్తినెత్తుకునే బతుకమ్మను ఇచ్చగొట్టింద్రు" తడారిన గొంతుతో అన్నడు.

"చుండూరులో నిండు జీవితాలనే కాల్చినోళ్లు ...కారంచేడులో కత్తులు నూరినోళ్లు... ప్యాపిలీలో గణపతినే పలుగ్గొట్టినోళ్లు.... ఇక్కడ బతుకమ్మనెట్ల ఉంచుతరు. మనపిచ్చి గాని..." అన్నది గంగ.

బతుకమ్మల గుంపు గంగను దాటుకుని చెరువు వైపు సాగిపోతుంది.

(కస్తూరి ఆనందాచార్య స్మారక కథల పోటి- 2003లో మొదటి బహుమతి పొందిన కథ)

(పత్రిక-మాసపత్రిక మార్చి -2004)

(రతనాలవీణ కథా సంకలనం -2006)